సాక్షి సంగారెడ్డి

శనివారం । 9 । ఆగస్టు । 2025



వల విసరాలి.. ఈత కొట్టాలి
మత్స్యకార సహకార సంఘాల్లో సభ్యత్వం కోసం యువతకు సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వివరాలు 8లో ▸



మొక్క నాటాలి పక్కా!
గ్రామాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలు పెంచేందుకు కృషి చేస్తున్నాయి. వివరాలు 8లో ▸



భారీ వర్షం... అతలాకుతలం
హత్నూర మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వివరాలు 9లో ▸

సెల్ఫీ విత్ రాఖీ



సంగారెడ్డి జోన్: అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఈ సందర్భంగా అందరినీ భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో 'సాక్షి' ఆధ్వర్యంలో 'సెల్ఫీ విత్ రాఖీ'ఫొటోలను ఆహ్వానిస్తుంది. రాఖీలను ధరించిన వారు సెల్ఫీ తీసి మాకు శనివారం పంపిస్తే ప్రచురిస్తాం. పర్యావరణహితమైన రాఖీ ఫొటోలకు ప్రాధాన్యం ఉంటుంది. మీరు పంపించాల్సిన ఫోన్ నంబర్లు

9505872923, 9949849479

రాఖీ పౌర్ణమి సందడి

రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ దుకాణాల వద్ద సందడి నెలకొంది. జిల్లాలోని న్యాల్‌కల్ బస్టాండ్ వద్ద ఆకర్షణీయమైన రాఖీలతో విక్రయ కేంద్రాలు వెలిశాయి. శుక్రవారం ప్రజలు రాఖీలు కొనుగోలు చేస్తున్న సమయంలో ఇలా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.
–న్యాల్‌కల్(జహీరాబాద్)



న్యాల్‌కల్‌లో రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

శ్రావణ శోభ

శ్రావణ శుక్రవారం సందర్భంగా సంగారెడ్డిలోని పలు ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మహిళలంతా వరలక్ష్మి వ్రతాలు చేసుకున్నారు. ఇళ్లను అందంగా ముస్తాబు చేసుకుని అమ్మవారిని అందంగా అలంకరించుకున్నారు.కొత్తబస్టాండ్ మహాలక్ష్మి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి హారతులు పట్టారు. శనగలు, అరటిపండ్లు, కీరా నైవేద్యం సమర్పించారు. పూజ అనంతరం ఒకరికొకరు వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి





సంగారెడ్డి మహాలక్ష్మి ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీదేవి, ఎస్‌ఎస్‌కే భవన్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

బడులకు హరిత రేటింగ్

- ఎంపికయ్యే పాఠశాలలకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకం
- గతేడాది స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు జిల్లా దూరం



లింగాపూర్ గ్రామంలో పచ్చని చెట్ల మధ్య ప్రాథమిక పాఠశాల

నారాయణఖేడ్: విద్యార్థి దశనుంచే పర్యావరణ పరిరక్షణ, సమాజాన్ని చైతన్య పరిచేలా పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం రేటింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గతంలో ఉన్న స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ స్థానంలో 'స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్)ను అమల్లోకి తీసుకొచ్చింది. రాష్ట్రస్థాయిలో 20 పాఠశాలలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇవ్వనున్నారు. ఫైవ్‌స్టార్ రేటింగ్‌కు ఎంపికైన పాఠశాలలను జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. దీంతోపాటు ఉత్తమ స్కోర్ సాధించిన పాఠశాలలకు జిల్లా, రాష్ట, జాతీయస్థాయిలో గుర్తింపునిస్తారు. ఒక్కో జిల్లా నుంచి 8 పాఠశాలలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో గరిష్టంగా 20 పాఠశాలలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి సెప్టెంబర్ 30వరకు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో వివరాలను ఆయా పాఠశాలలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది.

పలు పాఠశాలల్లో కార్యక్రమాలు

జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇప్పటికే కొందరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. చాలా పాఠశాలలు పచ్చదనంతో కళకళలాడుతుంటాయి. జిల్లాలో ఇటీవలి కాలంలో మన ఊరు మన బడి పథకం కింద 441 పాఠశాలల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాలల మరమ్మతులు, ప్రహరీల నిర్మాణం, చిత్రలేఖనం, ఆధునిక టాయ్‌లెట్ల నిర్మాణం, పూర్తిస్థాయిలో కిచెన్‌షెడ్‌లు, డైనింగ్, వాష్ ఏరియా ఎఫ్‌ఎల్‌ఎస్, ఎల్‌ఈడీ సిస్టమ్స్, సంప్‌హౌజ్‌ల నిర్మాణం, కూర్చోడానికి డోల్‌డెక్స్‌ల ఏర్పాటు తదితరాలను చేపట్టారు.

పచ్చదనం..పరిశుభ్రత పెంపు లక్ష్యం

పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణ సుస్థిరతకు పాఠశాలలను చిరునామాగా మార్చడం, వాటిపై విద్యార్థులకు అవగాహన పెంచడం, ఎస్‌హెచ్‌వీఆర్ 2025–26లక్ష్యంగా కేంద్రం నిర్ధారించింది. ఇప్పటికే పలు పాఠశాలల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పచ్చదనం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎస్‌హెచ్‌వీఆర్ కింద ఎంపికయ్యే పాఠశాలలకు రూ.లక్ష నగదు బహుమతిని అందజేస్తారు. సదరు పాఠశాల హెచ్‌ఎంను మూడు రోజులపాటు ప్రముఖ సంస్థలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు.

ఎక్కువ పాఠశాలలు ఎంపికయ్యేలా చూస్తాం



కేంద్రంనుంచి వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా ఈసారి జిల్లాలో ఎక్కువ పాఠశాలలు ఎంపికయ్యేలా కృషి చేస్తాం. ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తాం. రేటింగ్‌కు అధిక పాఠశాలలు ఎంపికయ్యేలా చూస్తాం. ఈసారి జిల్లాకు స్వచ్ఛ విద్యాలయ పురస్కారం వచ్చేలా కృషి చేస్తాం.
– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, సంగారెడ్డి



నిమ్జ్ ప్రాజెక్టులోకి వెళ్లేందుకు వీలుగా నిర్మించిన రహదారి

నిమ్జ్ రహదారి పనులు పూర్తి

- వారం రోజుల్లో వినియోగంలోకి
- రూ.173కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు
- వంద అడుగుల వెడల్పుతో 9.3 కిలోమీటర్ల బీటీ రహదారి


జహీరాబాద్: జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్)కు పరిశ్రమల రాకకోసం ప్రత్యేకంగా రూ.173 కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయి. మరో వారం రోజుల్లో మిగతా పనులన్నీ పూర్తి కానున్నాయి. సుమారు 9.3 కిలోమీటర్ల మేర 100 అడుగుల విస్తీర్ణంతో బీటీ రహదారిని నిర్మించారు. రూ.100 కోట్లు నిమ్జ్ ప్రాజెక్టు నుంచి మిగతా రూ.73 కోట్లు టీజీఐఐసీ నుంచి నిధులు కేటాయించారు. జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి జంక్షన్ నుంచి ఝరాసంగం మండలంలోని ఎల్గొయి గ్రామ పరిధిలోని నిమ్జ్ ప్రాజెక్టు వరకు రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ రహదారిని హుగ్గెల్లి జంక్షన్ వద్ద 65వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేశారు. జాతీయ రహదారి నుంచి వచ్చిపోయే వాహనాలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఉండేందుకు వీలుగా సర్వీస్ రోడ్లను నిర్మించారు. ప్రస్తుతం సర్వీసు రోడ్డు వద్ద మైనర్ పనులు మాత్రమే మిగిలి ఉండగా.. వారంలో పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బైపాస్ వద్ద నిర్మించిన సర్వీస్ రోడ్డు సైడ్ వాల్స్‌లకు రంగులు అద్దే పనులు చేపట్టారు.

చివరి దశలో ఎలక్ట్రిక్ పనులు

రహదారిపై చేపట్టిన ఎలక్ట్రిక్ పనులు సైతం చివరి దశలో ఉన్నాయి. సుమారు రూ.3.50 కోట్ల మేర నిధులను విద్యుత్ పనులకు కేటాయించారు. 9 కిలోమీటర్ల పొడవున 365 విద్యుత్ స్థంభాలు ఇరువైపులా లైట్లు వెలిగేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. అయితే నిమ్జ్ ప్రాజెక్టు ఇన్‌గేట్, ఔట్‌గేట్ వద్ద హైమాస్ట్ లైట్లను బిగించేందుకు ప్రతిపాదించారు. ఈ పనులను మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ పనులు సైతం వారం రోజుల్లో పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

2013లో నిమ్జ్ ప్రాజెక్టు మంజూరు

నిమ్జ్ ప్రాజెక్టు 2013లో మంజూరైంది. న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల పరిధిలో నిమ్జ్ ప్రాజెక్టు కోసం 12,635ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 6,790 ఎకరాల భూ సేకరణ పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రూ.2,361 కోట్ల వ్యయంతో స్మార్ట్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిమ్జ్ ప్రాజెక్టు కోసం గుర్తించిన భూమిలో స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయనున్నారు.



సింగూరుకు ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద చేరుతోంది. శుక్రవారం 2,161 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలకుగాను ప్రస్తుతం 21.000 టీఎంసీల నీటి సామర్థ్యం ఉంది. డ్యాం నుంచి ప్రతీరోజు తాగు,సాగుకు నీటిని విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ హయాంలోనే ఉద్యోగ అవకాశాలు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



మంత్రులను సన్మానించిన ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ హయాంలోనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనతో తోషిబా పరిశ్రమలో పెట్టుబడులు వచ్చాయని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం తోషిబా పరిశ్రమలో శుక్రవారం నూతన ప్లాంట్ ఆవిష్కరణలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి వివేక వెంకటస్వామి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఐఎన్‌టీయూసీ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో వేలాది పరిశ్రమల ఏర్పాటు, లక్షలాది కార్మికుల జీవనోపాధి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, తోషిబా పరిశ్రమ ఐఎన్‌టీయూసీ నాయకులు సుందర్, ఎల్లయ్య, సుధాకర్, రాజు, సంజీవ్ కార్మిక సంఘం నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఓట్లను చేర్చాలి

గాంధీ విగ్రహం వద్ద సీపీఎం నిరసన

జహీరాబాద్ టౌన్: బిహార్‌లో రద్దు చేసిన 64 వేల ఓట్లను పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎం నాయకులు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రాంచందర్ మాట్లాడుతూ...ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కమిషన్ బిహార్‌లో ప్రతిపక్షాలకు సంబంధించిన వేల ఓట్లను తొలగించిందని ఆరోపించారు. ఎస్సీ నియోజకవర్గంలో 60% నుంచి 40% ఓట్లు తగ్గించారని మండిపడ్డారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహిపాల్, సుకుమార్, నర్సింహులు, బక్కన్న, సంజీవ్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో సత్తా చాటిన అహిల్



లక్డీకాపూల్: హైదరాబాద్‌కు చెందిన ఎండీ అహిల్‌టేబుల్ టెన్నిస్‌లో సత్తా చాటారు. ఇటీవల ఒడిశాలోని కళింగ స్టేడియంలో టాబ్ ఏఐటీఏ–ఒటీఏ చాంపియన్‌షిప్ సిరీస్(సీఎస్7) పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎస్– 7 అండర్ 14 విభాగంలో తెల్లాపూర్‌కు చెందిన అహిల్ బెంగళూర్‌కు చెందిన నమన్ స్వరూప్‌ను 7-5, 6-4 తేడాతో ఓడించారు.

కిర్బీలో సీఐటీయూ విజయం

బీఆర్టీయూపై చుక్కా రాములు గెలుపు

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి పాశమైలారం పారిశ్రామిక వాడలోని కిర్బీ పరిశ్రమలో శుక్రవారం జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూ నాలుగోసారి విజయ దుందుభి మోగించింది. సీఐటీయూ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు బరిలో నిలిచారు. పరిశ్రమలో మొత్తం 578 ఓట్లకు గాను 576 ఓట్లు పోలవగా 2 ఓట్లు చెల్లలేదు. సీఐటీయూకు 295, బీఆర్టీయూ కూటమికి 281 ఓట్లు రాగా 14 ఓట్ల తేడాతో చుక్కా రాములు విజయం సాధించారు.

అప్‌గ్రేడ్‌తో మెరుగైన వైద్య సేవలు



మంత్రిని కలిసిన రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ల సంఘం ప్రతినిధులు

- మంత్రి దామోదర రాజనర్సింహ
- సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

సంగారెడ్డి జోన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డెరెక్టర్ సెకండరీ హెల్త్‌గా త్వరలో అప్‌గ్రేడ్ చేస్తామని, దీంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు దోహదపడుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సేవలందిస్తోన్న అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించినందుకు శుక్రవారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు కలిసి దామోదరకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ఖాళీగా ఉన్న 1,690 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. డాక్టర్ల పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించనున్నట్లు చెప్పారు. బోధనేతర విభాగంలో డీఎంఈ, డీహెచ్, టీవీవీపీలలో టైం బాండ్ ప్రమోషన్ల భర్తీలో వయోపరిమితి పెంపుపై కామన్ నిబంధనలు రూపొందించేందుకు నిపుణుల కమిటీని నియమిస్తామన్నారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు డా.నరహరి, సెక్రెటరి జనరల్ డా.లాలు ప్రసాద్, డా.రావూఫ్, డా.వినయ్ కుమార్, డా.గోపాల్, డా.క్రాంతి, డా.అశోక్, డా.రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణకు మోక్షం

- ఎట్టకేలకు రాయితీపై సాగు పరికరాలు
- ఏడేళ్ల తర్వాత నిధుల కేటాయింపు
- ఉమ్మడి జిల్లాకు 16వేల యూనిట్లు
- రూ.4.96కోట్లు మంజూరు
- మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ
- లబ్ధిదారులను ఎంపిక చేయనున్న కమిటీలు

వ్యవసాయ యాంత్రీకరణకు మోక్షం లభించింది. దాదాపు ఏడేళ్ల తర్వాత వ్యవసాయ పరికరాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. కానీ ఈ ఏడాది కేవలం పనిముట్లకే పరిమితం చేశారు. పంటల సాగులో కూలీల ఖర్చును తగ్గించడానికి వ్యవసాయ యాంత్రీకరణ దోహదపడనుంది. 2025–26 సంవత్సరానికి ఉమ్మడి మెదక్ జిల్లాకు 16,275 యూనిట్లకు రూ.4.96కోట్లు మంజూరు చేశారు. త్వరలో రైతులకు పరికరాలను అందించేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
– సాక్షి, సిద్దిపేట

నిధుల కేటాయింపు ఇలా..

జిల్లా	నిధులు(రూ.)	యూనిట్లు
మెదక్	1,08,40,408	2,713
సంగారెడ్డి	2,23,45,603	7,883
సిద్దిపేట	1,64,79,528	5,679

ఉమ్మడి మెదక్ జిల్లాలో దాదాపు 12లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. రైతులకు అందించే వ్యవసాయ పరికరాలను మహిళా రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం రాయితీపై ఇవ్వనున్నారు. మిగతా వారికి 40శాతంతో అందించనున్నారు. ఐదు ఎకరాలకంటే తక్కువ భూములు ఉన్న రైతులకు సబ్సిడీ పై వివిధ రకాల పరికరాలు అందిస్తారు. స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో నడిచే వ్యవసాయ పరికరాలు రోటోవేటర్లు, నాగళ్లు, గొర్రు, కలుపు తీసే యంత్రాలు, పవర్ ట్రిల్లర్లు, మొక్కజొన్న తీసే యంత్రం తదితర వాటిని అందజేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లాకు, అత్యల్పంగా మెదక్ జిల్లాకు నిధులు కేటాయించారు.

ఎంపిక బాధ్యత కమిటీలదే..

వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందజేసేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. రాయితీ రూ.లక్ష దాటితే జిల్లా కమిటీ ఆమోదం తప్పనిసరి. ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న వారు ఈ రాయితీ పథకానికి అర్హులు. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఏఓ, ఆగ్రోస్, ఎల్‌డీఎం, శాస్త్రవేత్త సభ్యులుగా ఉండనున్నారు. మండల స్థాయి కమిటీలో మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్, ఎంపీడీవోలు ఉంటారు. ఈ పరికరాల కోసం అర్హులను ఈ కమిటీలు ఎంపిక చేయనున్నారు.



వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు

ఏడేళ్ల తర్వాత..

2017–18 సంవత్సరం వరకు యాంత్రీకరణ పథకం అమలులో ఉంది. మళ్లీ ఏడేళ్ల తర్వాత పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ఏడాది నిధులను మంజూరు చేశారు. గతంలో ట్రాక్టర్లు అందించే వారు. ఈ ఏడాది కేవలం యాంత్రీకరణ పనిముట్ల వరకే పరిమితం చేశారు. గతంలో మాదిరిగా ట్రాక్టర్లు సైతం అందిస్తే రైతులు ఆర్థికంగా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

సాగు సంబురం

- ఏడాది తర్వాత కాలువల్లో సింగూరు జలాలు
- రైతుల్లో హర్షాతిరేకం



వరి నారు తీస్తున్న కూలీలు

పుల్‌కల్(అందోల్): రెండు పంటల విరామానంతరం వ్యవసాయానికి సింగూరు నీరు వదలడంతో రైతులు సాగు సంబురాల్లో మునిగిపోయారు. సింగూరు సాగునీరు ఆలస్యంగా విడుదల చేయడంతో ఖరీఫ్ వరి సాగు ఆలస్యంగా మొదలై ఆగస్టు చివరి నాటికి పూర్తి కానున్నాయి. జూన్ ఆఖరి వారంలో విడుదల చేయాల్సిన నీరు జూలై 17న విడుదల చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ లిఫ్టులను ఆన్‌చేసి నీరు విడుదల చేయడంతో ఆయకట్టు కింద రైతులు వరి సాగు పనులు పెట్టారు. సింగూరు ఆయకట్టు కింద పుల్‌కల్,చౌటకూర్,అందోల్ మండలాలతో వరి చేలు తడుపుతు చెరువుల్లోకి చేరుతాయి. సుమారు 145 చెరువులకు సింగూరు కాలువలతో అనుసంధానం చేశారు.

40 వేల ఎకరాల్లో

ఎడుమ కాలువ ఆయకట్టు పరిధిలో సాగునీరు విడుదల చేయడంతో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఆగస్టు రెండో వారం వరకు వరి సాగు చేసినా దిగుబడుల్లో ఢోకా లేకపోవడంతో వరి పంటకు ప్రాధాన్యతనిస్తున్నారు. కాలువ కింది ఆయకట్టు రైతులతోపాటు చెరువులు నిండటంతో చెరువుల కింది ఆయకట్టు రైతులు కూడా వరి సాగు చేశారు. అయితే ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడం, యాసంగిలో సన్నరకం పండించిన రైతులకు బోనస్ నగదు రైతు ఖాతాల్లో జమకావడంతో వానాకాలంలో ఎక్కువగా సన్నరకాలకు మొగ్గ చూపారు.

ఉత్తరభారత కూలీలతో తీరిన కొరత

వరి నాట్లు వేయడానికి ఉత్తర భారత్‌కు చెందిన రాష్ట్రాల నుంచి కూలీలు రావడంతో వరినాట్లు సులభంగా అవుతున్నాయి. ఈ కూలీలకు ఎకరాకు రూ.4వేల నుంచి రూ.5 వేలు చెల్లిస్తున్నారు.

చివరి ఆయకట్టుకు అందేనా?

సింగూరు కాలువ 60 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అందోల్ మండలంలోని చివరి ఆయకట్టు రైతులకు నీరు రావడం లేదని రైతులు ఆరోపించారు. చివరి ఆయకట్టు కాలువల్లో నీరు పారాలంటే సింగూరులో నీటి పంపింగ్ ఎక్కువగా జరగాలి. వర్షాలు కురుస్తుండటంతో అధికారులు నీటి ప్రవాహాన్ని తగ్గించారు.

కాలువ నీటితో సాగు..



వానలు ఆలస్యంగా కురవ డంతో వరి నాట్లు ఆలస్యమవుతు న్నాయి. ఉత్తర భారత కూలీలు రావడంతో నాట్లు సులభమవుతా యి. నేనే ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేస్తు న్నా.
–కుమ్మరి రాజు (రైతు, ముద్దాయిపేట)

సన్నాలు వేశాం



ఏడెకరాల్లో సన్న రకం వరి వేశాం. ఎప్పుడూ ఒకే రకం విత్తనం కాకుండా మార్పు చేయాలని సన్నరకం నాటాము.
–పుష్పలత (ముద్దాయిపేట రైతు)

క్లుప్తంగా

దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న నిర్వాహకులు, భక్తులు

పాపన్నపేట(మెదక్): పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దుర్గామాత ఆలయ సన్నిధిలో శుక్రవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పల్లకిలో ఊరేగించారు. ఆలయం నుంచి రాజగోపురం మీదుగా ఊరేగింపు కొనసాగింది. ఆలయ సిబ్బంది బ్రహ్మచారి, ప్రతాపరెడ్డి, సూర్య శ్రీనివాస్, రాజు, వరుణాచారితోపాటు భక్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం (పటాన్‌చెరు): అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. గడ్డపోతారం మున్సిపాలిటీ ఖాజీపల్లి పరిధిలోని సర్వేనం.181లో జర్నలిస్ట్ కాలనీ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ దేవదాస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌ను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు

చిన్నకోడూరు(సిద్దిపేట): తండ్రికి కూతురు అంత్యక్రియలు నిర్వహించింది. ఈ ఘటన మండల పరిధిలోని రాముని పట్లలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కర్రె శంకర్ అనారోగ్యంతో మృతి చెందగా, కుమారులు లేకపోవడంతో కూతురు శ్రావణి తలకొరివి పెట్టింది.

విద్యుత్ వైరు తెగిపడి.. వీధి కుక్క మృతి



చనిపోయిన వీధి కుక్క

నర్సాపూర్ : విద్యుత్ వైరు తెగిపడి వీధికుక్కపై పడటంతో మృత్యువాత పడింది. పట్టణంలో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పాటు గాలి వీచడంతో ఎన్జీవోస్ కాలనీలో ఓ చోట కరెంటు వైరు తెగిపడింది. కాగా వీధి కుక్కలు అటుగా తిరుగుతున్న సమయంలో వైరు కుక్కపై పడటంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన కుక్కలు అక్కడి నుంచి పారిపోయాయి. వర్షానికి తోడు రాత్రి కావడంతో ప్రజలు బయటకు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

అదృశ్యమై.. బావిలో శవమై..

జహీరాబాద్‌టౌన్: అదృశ్యమైన మహిళ బావిలో శవమై కనిపించింది. ఈ ఘటన మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ కాశీనాథ్ వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన జంబుల బక్కమ్మ(49) ఈ నెల 4న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకుంది. ఉదయం చూసేసరికి కనిపించలేదు. ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటికి రాకపోవడంతో బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. కుటుంబ కలహాల వల్లే బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి కుమారుడు వంశీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వల విసరాలి..

మత్స్యకారుల నైపుణ్యాలను పరీక్షిస్తున్న అధికారులు

ఈత కొట్టాలి

మత్స్యకార సంఘాల్లో సభ్యత్వానికి యువత ఆసక్తి

- నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు
- జిల్లాలో 1634 చెరువులు, కుంటలు
- విస్తీర్ణం తగ్గించాలని డిమాండ్

హుస్నాబాద్‌రూరల్: పల్లెల్లో వానలు కురిసి వాగులు పొంగి పొర్లితే మత్స్యకారులు వలలు పట్టుకుని చేపల వేటకు బయలు దేరుతారు. ఏళ్ల తరబడి చేపలు పట్టిన మత్స్యకార సంఘాల్లో సభ్యత్వం లేకపోయేసరికి యువత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేయడానికి గత ప్రభుత్వం ఉచిత చేపల పంపిణీ, రవాణా కోసం సబ్సిడీపై ద్విచక్ర, గూడ్స్ వాహనాలు ఇవ్వడం వల్ల సభ్యత్వం తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సంఘంలో సభ్యులను చేర్చుకోవాలంటే ఒక సభ్యునికి రెండెకరాల చెరువు, కుంటల విస్తీర్ణంను లెక్కలోకి తీసుకుని అధికారులు సభ్యత్వం ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల విస్తీర్ణం తక్కువగా ఉండి మత్స్యకారుల జనాభా ఎక్కువ ఉండటంతో సభ్యతం పొందడానికి యువతకు నిబంధనలు అడ్డు వస్తున్నాయి. గత ప్రభుత్వం రెండున్నర ఎకరాలను రెండెకరాలకు తగ్గించిందని, ఈ ప్రభుత్వం విస్తీర్ణం ఎకరాకు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

సభ్యత్వం పొందాలంటే..

మత్స్యకార సహకార సంఘాల్లో యువత సభ్యత్వం పొందాలంటే ఈత వచ్చి ఉండాలి. వల విసరడం, పాడ్రీ వల లాగడం వంటి పరీక్షల్లో మత్స్యకారులు నైపుణ్యం ఉండాలి. కెనాల్ ఏరియాలో అయితే వల అల్లడం, తెప్పకొట్టడంలో నైపుణ్యం తప్పనిసరి. నూతన సభ్యత్వం ఇవ్వాలంటే చెరువు విస్తీర్ణంతోపాటు వృద్ధులను తొలగించి యువతకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రతి ఏటా మత్స్యకార యువత నూతన సభ్యత్వాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కోహెడ, తోటపల్లి ఊర చెరువుల్లో శుక్రవారం యువతకు నైపుణ్య పరీక్షను అధికారులు నిర్వహించారు. కాగా సిద్దిపేట జిల్లాలో 1634 చెరువులు , కుంటలుండగా.. 338 సహకార సంఘాలు.. 23,400 మందికి పైగా సభ్యులున్నట్లు అధికారులు తెలిపారు.

నిబంధనల ప్రకారం



ప్రభుత్వ జీఓ 6 ప్రకారం చెరువు, కుంటల విస్తీర్ణం రెండెకరాలకు ఒకరి చొప్పున సభ్యత్వం ఇవ్వాలనే నిబంధన ఉంది. కెనాల్ ప్రాంతంలో ఎకరాకు ఒకరి చొప్పున సభ్యత్వం ఇవ్వాలనే నిబంధనల ప్రకారం కొత్త వారికి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. సహకార సంఘాల, మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణలో చేపడుతున్నాం. వీడియో చిత్రీకరణ చేసి సీడీని రాష్ట్ర కమిటీ పరిశీలనకు పంపిస్తాం. రాష్ట్ర కమిటీ ఆమోదంతో నూతన సభ్యత్వాలు వస్తాయి.

– మల్లేశం, ఏడీ, జిల్లా మత్స్యశాఖ

గుర్తింపుతోనే సంక్షేమ పథకాలు

మత్స్యకార సంఘంలో గుర్తింపుతోనే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వస్తున్నాయి. వ్యాపార అవసరాల కోసం సబ్సిడీ గూడ్స్ వాహనాలను ఇవ్వడంతో మత్స్యకారులు చేపలు, పండ్ల రవాణా కోసం వినియోగించి ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం ప్రతిఏటా ఉచితంగా చేప పిల్లల ను పంపిణీ చేస్తుండటంతో సభ్యత్వం లేనివారు మత్స్యసంపదలో వాటా పొందలేకపోతున్నారు. ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టు, కెనాల్ కాల్వల విస్తీర్ణంను లెక్కలోకి తీసుకుని అర్హత కలిగిన యువ మత్స్యకారులకు సభ్యత్వాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: గంజాయి విక్రయించేందుకు వేచి ఉన్న యువకులను టాస్క్‌ఫోర్స్, సిద్దిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వివరాల ప్రకారం... మిట్టపల్లికి చెందిన సిద్దరబోయిన అఖిల్, సిద్దరబోయిన పవన్‌కుమార్ కొంత కాలంగా హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకొచ్చి తెలిసిన వారికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సైతం విక్రయించడానికి నాంచారుపల్లి శివారులో వేచి ఉండగా పోలీసులు వారిని అరెస్టు రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 2800 విలువైన 140 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రయ్య, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, త్రీటౌన్ సిబ్బంది ఉన్నారు.

యూట్యూబర్‌పై పోలీసులకు ఫిర్యాదు

చిన్నశంకరంపేట (మెదక్): అక్రమాలను యూట్యూబ్ చానెల్‌లో ప్రసారం చేస్తానని తనను బెదిరించి డబ్బులు వసూలు చేశాడని యూ ట్యూబర్‌పై సర్వేయర్ శ్రీకాంత్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నార్సింగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నార్సింగి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విధులకు హాజరైన తనను వీడియో తీసి కథనం ప్రసారం చేసి త్వరలో అక్రమాలు భయటపడతానని బెదిరించాడన్నారు. శుక్రవారం యూట్యూబర్ లింగంతో మెదక్‌లో చర్చలు జరిపిన తాను కొంత నగదు, ఉంగరం ఇచ్చినట్లు తెలిపాడు. అనంతరం ఎలాంటి తప్పు చేయకున్న తనను బెదిరించి డబ్బులు, ఉంగరం తీసుకున్నాడని మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. అలాగే రామాయంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఐటీఐలో వాక్ ఇన్ అడ్మిషన్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఐటీఐతోపాటు ప్రైవేట్ ఐటీఐలో వాక్ ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, 14ఏళ్లు పూర్తయిన అభ్యర్థులు అర్హులని, ఎటువంటి గరిష్ఠ వయస్సు పరిమితి లేదని వెల్లడించారు. ఈనెల 6నుంచి వచ్చిన దరఖాస్తులను అదే రోజు వాక్ ఇన్ అప్లికేషన్ కోసం పరిగణించబడతాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ప్రవేశాల కోసం వెబ్‌సైట్ https://iti telangana gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ అడ్మిషన్ పొందాలనుకునేవారు అడ్మిషన్‌కు సంబంధించి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆన్‌లైన్ ప్రింట్స్‌తో హాజరు కావాలని తెలిపారు. సమాచారం కోసం 8500464377 లో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలు



లక్ష్మి మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): అనారోగ్యంతో బాధపడుతూ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నార్సింగి మండలం వల్లూర్ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సృజన కథనం మేరకు... మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం చంద్రగిరినగర్‌కు చెందిన మన్నె లక్ష్మి(65) అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటుంది. పనులకు వెళ్లిన కుమారుడు ఉమేశ్ సాయంత్రం వచ్చి చూడగా తల్లి కనిపించలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి ఆచూకీ కోసం వెతకగా.. వల్లూర్ జాతీయ రహదారి పక్కన బస్టాండ్ సమీపంలో నురుగలు కక్కుతూ పడిపోయిందని సమాచారం అందుకున్నారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా మృతి చెంది ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ..

తూప్రాన్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దతార్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన చింతల పవన్‌కళ్యాన్(24) ఆర్థిక ఇబ్బందులతో గత నెల13న పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. తిరిగి 22న మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య పరమేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చందా కోసం రోడ్డుకు అడ్డంగా తాడు

బైక్ పైనుంచి కిందపడి మహిళ తలకు గాయాలు



గాయపడిన లావణ్య

తూప్రాన్: వినాయక చందాల కోసం రోడ్డుకు అడ్డంగా కట్టిన తాడు బైక్‌పై వెళుతున్న దంపతులకు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణ పరిధిలోని ఆబోతుపల్లిలో శుక్రవారం జరిగింది. బాధితుల వివరాలు ప్రకారం... చందా కోసం చిన్నారులు రోడ్డుకు అడ్డంగా తాడు కట్టి వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో తూప్రాన్ నుండి గుండ్రెడ్డిపల్లి వైపు బైక్‌పై వెళుతున్న చింతకింది నారాయణగౌడ్, లావణ్య దంపతులు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో లావణ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసపత్రికి తరలించారు. కాగా పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సామ్రాజ్యవాద విధానాలతో ప్రమాదం



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: అమెరికా సామ్రాజ్యవాద విధానాలతో ప్రపంచదేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్యూబాకు సంఘీభావ నిధికి కార్మికుల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాకు దగ్గరలో ఉన్న క్యూబా దేశాన్ని ఆర్థికంగా, వాణిజ్యపరంగా ఇబ్బందులకు గురి చేస్తూ తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. కరోనా సమయంలో వైద్యులు, నర్సులు, మందులను పంపించి క్యూబా ఉచితంగా ప్రపంచానికి సేవ చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, స్వామి, భిక్షపతి, సాజిద్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

– ఎనిమిది మందిపై కేసు

హవేళీఘణాపూర్(మెదక్): పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేశ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన 8మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.17,279 నగదు, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, చట్ట విరుద్ధమైన పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యాన అభివృద్ధికి ప్రణాళిక

- నాబార్డు అధికారులతో వీసీ సమావేశం
- కుదిరిన అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి దశాబ్ద ప్రణాళికకు కృషి చేస్తున్నట్లు ములుగు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్.దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వర్సిటీలో నాబార్డు సీనియర్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయ్‌భాస్కర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జీషావి, జనరల్ మేనేజర్ శ్రీనిధిరాజ్‌లతో వీసీ చర్చించారు. రాష్ట్ర ఉద్యాన రంగంలో స్థిరమైన వృద్ధికి కావాల్సిన వ్యూహాత్మకమైన రోడ్‌మ్యాప్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీసీ వివరించారు. ఇందులో సాంకేతిక సమన్వయం, వాతావరణ సహనశక్తి, విలువల శ్రేణి అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. ఉద్యాన అభివృద్ధి ప్రణాళికలో ఉత్పాదకత, స్థిరత్వం, మార్కెట్ అనుసంధానాల పెంపునకు నాబార్డు మద్దతు ఇస్తుందని ఉదయ్ భాస్కర్ హామీ ఇచ్చారు. ములుగు కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు హైదరాబాద్‌కు చెందిన ఐసీఏఆర్, అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఏటీఏఆర్)ల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. వర్సిటీ వీసీ రాజిరెడ్డి, ఐసీఏఆర్ డైరెక్టర్ డా.షేక్‌మీరాల సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా పరిశోధన, విస్తరణ సామర్థ్య నిర్మాణం రంగాల్లో సహకారం బలపడుతుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు భగవాన్, చీనా నాయక్, సురేశ్‌కుమార్, సునందిని, జి.సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి రవాణా

అడ్డుకున్న రైతులు



జేసీబీని అడ్డుకుంటున్న బాధిత రైతులు

జిన్నారం (పటాన్‌చెరు): అసైన్డ్ భూముల నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి రవాణాను రైతులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలోని సర్వేనం.1 అసైన్డ్ భూములను పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం రైతుల నుంచి స్వాధీనం చేసుకుంది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం కింద ఎకరానికి 600 గజాల చొప్పున కేవలం పట్టాలను అందజేసి పొజిషన్ కూడా చూపకుండా చేతులు దులుపుకుంది. న్యాయం చేయాలని బాధిత రైతులు అధికారుల వద్ద పలుమార్లు వారి గోడును వెళ్లబోసుకున్న పట్టించుకోలేదని తెలిపారు. కాగా పరిశ్రమల పేరిట భూములను స్వాధీనం చేసుకున్న కొందరు కొన్ని రోజులుగా ఆ భూముల నుంచి అక్రమంగా మట్టిని వేరే ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో శుక్రవారం బాధిత రైతులు అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. ఇటు భూములు కోల్పోయి, అటు పరిహారం అందక అయోమయానికి గురవుతున్నామని వాపోయారు. ఈ సమయంలో మట్టి రవాణా చేస్తూ అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నారని అధికారులకు వివరించారు. బాధిత రైతులు విట్టల్, రమేశ్, శ్రీనివాస్ గౌడ్, నర్సింలు, మల్లేశ్, శ్రీధర్ గౌడ్, స్థానికులు శ్రీకాంత్ గౌడ్, బ్రహ్మేందర్ గౌడ్ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం



కార్మికులను సన్మానిస్తున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి , నాయకులు

రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో అవసరమని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో 'సఫాయికి సలాం' కార్యక్రమం శివ్వంపేటలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదండరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఎంతో చర్చిస్తానన్నారు. ఆంగ్లేయులను భారతదేశం నుండి పంపించేందుకు క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించారని, ఈ ఉద్యమంలో కిందిస్థాయిలో సఫాయిలు (పారిశుద్ధ్య కార్మికులు) చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలనే ఆలోచనలు ఉన్నప్పటికి ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంత ఆలస్యమవుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి సఫాయి కార్మికునికి సొంత నిధులతో స్వెట్టర్లు అందజేస్తానని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా రైతు రక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్, సలహాదారులు చంద్రశేఖర్ కోదండరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటలావణ్య, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంతరావు, వెంకట్‌రామిరెడ్డి, నవీన్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, గణేశ్, దావుద్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

బ్యాంక్ చోరీకి యత్నం

స్ట్రాంగ్ రూమ్ పగులగొట్టేందుకు ప్రయత్నించి విఫలం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని మెదక్–హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న బ్యాంకులో దొంగలు చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలో ఆటో నగర్‌లో ఎస్‌బీఐ బ్యాంక్ ఉంది. శుక్రవారం ఉదయం బ్యాంకులోకి వెళ్లిన స్లీపర్ స్ట్రాంగ్ రూమ్ వద్ద గోడను పగులగొట్టినట్లు ఆనవాళ్లు ఉండటంతో బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ మహేశ్‌కు విషయం తెలువడంతో బ్యాంకుకు వెళ్లి పరిశీలించారు. గురువారం రాత్రి స్ట్రాంగ్ రూమ్ వద్దకు వెళ్లిన దొంగలు గోడను బద్దలు కొట్టే ప్రయత్నం చేయగా పగులలేదు. సాధ్యం కాకపోవడంతో అక్కడి నుంచి దొంగలు వెళ్లిపోయినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. చోరీకి వచ్చిన వారు మంకీ క్యాప్‌లు ధరించడంతో వారిని గుర్తించడం సాధ్యం కాలేదని చెప్పారు. అయితే చోరీకి వచ్చింది స్థానికులా? ఇతర ప్రాంతాలకు చెందిన వారా? అనే దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

మొక్క నాటాలి పక్కా..



బర్దీపూర్ గ్రామంలో మహిళలకు మొక్కలను అందజేస్తున్న అధికారులు

- 'ఏక్ పేడ్ మాకా నామ్ పే' పేరుతో మహిళా సంఘాలకు మొక్కలు
- జిల్లాలో 12.96 లక్షల మొక్కల టార్గెట్
- మొక్కలను రక్షించాలంటున్న అధికారులు

సంగారెడ్డి టౌన్ : గ్రామాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలలో మొక్కలు పెంచేందుకు కృషి చేస్తున్నాయి. అందులోభాగంగానే కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని అధికారులు మొదలుపెట్టారు. (ఏక్ పేడ్ మాకా నామ్ పే) అమ్మ పేరిట ఒక మొక్క నాటండి అనే నినాదంతో ప్రతీ ఇంటికి 6 మొక్కలను ఇచ్చి వాటిని నాటాలని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలోని మహిళలు, మహిళా సంఘం సభ్యులు మొక్కలను నాటి వాటిని రక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 695 గ్రామ సంఘాలు ఉండగా అందులో 1.96 లక్షల మహిళా సంఘం సభ్యులున్నారు. జిల్లావ్యాప్తంగా 12.96 లక్షల మొక్కలను మహిళలతో నాటిస్తున్నామని అధికారులు తెలిపారు. జామ, మామిడి, సపోటా, దానిమ్మ, నిమ్మ, వివిధ రకాల పూల మొక్కలు ప్రతీ మహిళా కుటుంబానికి ఆరు మొక్కల చొప్పున అందజేయనున్నారు. గ్రామాల్లోని పరిసరాలు శుభ్రంగా ఉండటంతోపాటు చుట్టూ చెట్లను పెంచడంతో వాతావరణం కలుషితం లేకుండా, చక్కటి గాలి వస్తుందన్నారు. మహిళలు మొక్కలు నాటడంతో వర్షాలు పడి పంటలు సుభిక్షంగా పండాలని లక్ష్యంతో కేంద్రప్రభుత్వం సరికొత్త పథకాన్ని తీసుకొచ్చింది. గతేడాదికంటే ఈ సంవత్సరం ఎక్కువ మొక్కలు నాటి వాటిని రక్షించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు గ్రామ,మండల అధికారులు పరిశీలిస్తూ మొక్కలను పెంచేలా ప్రోత్సహిస్తారు. అనువైన స్థలాల్లో మొక్కలు నాటించనున్నారు. అడవులు తగ్గిపోతుండటం, పచ్చదనం కోల్పోతున్న తరుణంలో ప్రతీఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటి పర్యావరణాన్ని రక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..



పర్యావరణాన్ని కాపాడాలని లక్ష్యంతో గ్రామాల్లోని మహిళలు, మహిళా సంఘాల సభ్యులతో మొక్కలను నాటించి వాటిని రక్షించేలా కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇందులోభాగంగా కేంద్రప్రభుత్వం అమ్మ పేరుతో మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొక్కలను పెంచడంతోపాటు గ్రామాలను పచ్చని పల్లెలుగా చేయవచ్చు.

– సూర్యారావు, జిల్లా అదనపు డీఆర్డీఓ